క్లుప్తంగా

5 నుంచి మల్లికార్జున స్వామి ఆలయ వార్షికోత్సవాలు



విజయదుర్గా మల్లికార్జున స్వామి వారు

మధురవాడ: అయోధ్యనగర్‌లోని గ్లోబ్ స్కూల్ సమీపంలో గల శ్రీ విజయదుర్గా మల్లికార్జున స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మే 5, 6, 7 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు వెంకటరావు, అనురాధ దంపతులు తెలిపారు. ఇందులో భాగంగా ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు, విశేష అర్చనలు, హోమాలు నిర్వహిస్తామన్నారు. అలాగే పలు ఆధ్యాత్మిక, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. పూజల్లో పాల్గొనదలచే భక్తులు ఆలయ అర్చకులు రేజేటి కిరణ్ శర్మను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు చదువే ఆస్తి



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో బాలామణి

కొమ్మాది: భవిష్యత్తులో విద్యార్థులకు చదువే ఆస్తి అని ఎంఈవో కె.బాలామణి అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు నగరపాలెం పరిధి కాపుల దిబ్బడపాలెంలోని ఎంపీపీ పాఠశాలలో శుక్రవారం ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లలు మంచి లక్షణాలు అలవరచుకోవాలని, శ్రద్ధతో చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దివ్యాంగుల ఆర్కెస్ట్రా

మధురవాడ: స్వతంత్రనగర్‌లో నిర్వహిస్తున్న లక్ష్మీ దేవమ్మ ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం స్నేహనేత్ర దివ్యాంగుల ఆర్కెస్ట్రా విశేషంగా ఆకట్టుకుంది. వీరు ఆలపించిన సంగీతం, పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి.

క్షతగాత్రునికి పరామర్శ

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఇటీవల ప్రమాదానికి గురైన బీఏపీ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మాడిమి జనార్ధనరావును టీడీపీ నాయకులు శుక్రవారం పరామర్శించారు. సబ్‌స్టేషన్ వద్ద సర్వీస్‌రోడ్డుపై నిలిచిన మురుగునీరు కారణంగా ఎదురెదురు వాహనాలు వచ్చినప్పుడు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆ కారణంగానే జనార్ధనరావు గాయపడినట్టు టీడీపీ విశాఖ పార్లమెంట్ కార్యదర్శి పిట్ట సురేష్ అన్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకుని మురుగునీరు సర్వీస్ రోడ్డుపై లేకుండా చూడాలని కోరారు. జనార్ధనరావును పిల్లా రాజేష్, బడిగంట మహేష్, జోగ సన్యాసిరావు, గిడుతూరి శ్రీనివాసరావు పరామర్శించారు.

పిచ్చుకలకు గూళ్లు ఏర్పాటు చేద్దాం



బ్యానర్ ప్రదర్శిస్తున్న వలంటీర్లు

కొమ్మాది: వేసవి తాపం పెరిగిపోతున్న నేపథ్యంలో పక్షులకు ఆహారంతోపాటు గూళ్లు ఏర్పాటు చేసేందుకు యువత ముందుకు రావాలని విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ పిజ సాయి ప్రకాష్ పిలుపునిచ్చారు. ఎండాడలో గల అంబేడ్కర్ భవన్‌లో డోంట్ యూజ్ సింగల్ యూజ్ ప్లాస్టిక్ అనే అంశంపై అవగాహన కల్పించారు. జీవరాశికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకను పూర్తి స్థాయిలో నిషేధించాలని, అదే విధంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు.

'మా నమ్మకం నువ్వే జగన్'కు విశేష ఆదరణ



తగరపువలస అంబేడ్కర్ కూడలిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



తగరపువలస నుంచి ద్విచక్రవాహన ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- వైఎస్సార్‌సీపీకి ప్రజల మద్దతుతో ప్రతిపక్షాలకు ముచ్చెమటలు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం విజయవంతంగా నడుస్తున్న సందర్భంగా శుక్రవారం సాయంత్రం అంబేడ్కర్ కూడలిలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కేక్ కట్ చేసి భీమిలి వరకు ద్విచక్ర వాహనాల ర్యాలీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భీమిలి జోన్ వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కరు కూడలిలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 1.45 కోట్ల కుటుంబాలు అండగా నిలిచాయన్నారు. 1.10 కోట్ల కుటుంబాల వారు మిస్డ్ కాల్స్ ద్వారా మద్దతు తెలిపారన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీకి పెరుగుతున్న ఆదరణతో ప్రతిపక్షాలకు ముచ్చెమటలు పడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయన భీమిలి నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయోత్సవాల్లో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, 1, 2 వార్డుల కన్వీనర్ జగుపల్లి ప్రసాద్, 2వ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, శిష్ట కరణాల సంఘం రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు నమ్మి మాధవ, నాయకులు కొప్పల రమేష్, చిప్పాడ వెంకటేష్, బింగి హరికిరణ్‌రెడ్డి, చింతగుంట శివ, చిల్ల ప్రమీల, మునకాల ఆదినారాయణ, వెంపాడ రమణ, కుమిలి సూర్యనారాయణ, పందిరి విజయ్, సరగడ శివాంజనేయరెడ్డి, దుంప సాయిరెడ్డి, సిమ్మల ప్రసన్న, అమ్మిరెడ్డి, జీరు పద్మ, మద్ది మహాలక్ష్మి, కదిరి ఎల్లాజీ, అల్లిపల్లి నరసింగరావు, వాసుపల్లి కొండబాబు, మైలపల్లి లక్ష్మణరావు, వాసుపల్లి ఎల్లాజీ, కోండ్రు రామసూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

'వరద నీటి కాలువ, ఆర్టీసీ కాంప్లెక్స్ ఏవీ రాజబాబూ..?'



2016లో గంటా శ్రీనివాసరావు ఆవిష్కరించిన శిలాఫలకం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు



టీడీపీ హయాంలో ఆవిష్కరించిన శిలాఫలకాలు శిథిల స్థితిలో చిట్టివలస హైస్కూల్ వద్ద..

తగరపువలస: టీడీపీ అధికారంలో ఉండగా 2016లో అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు చిట్టివలస, తగరపువలస పరిధిలో వేసిన శిలాఫలకాలు, జరిగిన అభివృద్ధి పనులు తెలపాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చిల్ల బాబయ్యరెడ్డి, చిల్ల భాస్కరరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. భీమిలి రోడ్డులోని పాత ఆంధ్రాబ్యాంకు కూడలిలో అప్పట్లో వేసిన శిలాఫలకం వద్ద వారు శుక్రవారం మాట్లాడారు. రూ.1.3357 కోట్లతో ఆంధ్రా బ్యాంకు నుంచి మూలకుద్దులోని సూయిజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వరకు వరద కాలువ నిర్మాణానికి వేసిన శిలాఫలకం పనులు ఎక్కడ జరిగాయన్నారు. అదే రోజు బంగ్లామెట్ట వద్ద మంత్రి గంటా శ్రీనివాసరావు తగరపువలస పేరుతో ఆర్టీసీ డిపో, కాంప్లెక్స్ నిర్మాణానికి వేసిన శిలాఫలకం కూడా తమతో తీసుకుపోయారన్నారు. భీమిలి ప్రజలకు టీడీపీ ఇచ్చిన హామీల్లో రైతుబజారు కల సాకారం చేయలేకపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాతే 6 వేల మంది చిట్టివలస జ్యూట్ కార్మికులకు న్యాయం జరిగిందన్నారు. రూ.78 లక్షలతో రైతుబజారు నిర్మాణం పూర్తయిందన్నారు. సెల్ఫీల పిచ్చితో టీడీపీ భీమిలి ఇన్‌చార్జి కోరాడ రాజబాబు చేస్తున్న తప్పుడు ప్రచారాలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. టీడీపీ వేసిన శిలాఫలకాలు చిట్టివలస బాలికల జెడ్పీ హైస్కూల్ వద్ద ఏ స్థితిలో ఉన్నాయో చూసుకోవాలన్నారు. గడప గడపకు వెళ్తే వైఎస్సార్ సీపీ ఈ నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెలుస్తాయన్నారు. టీడీపీ హయాంలో నాయకుల దోపిడీ, జన్మభూమి కమిటీల అవినీతి తప్ప అభివృద్ధి జరగలేదన్నారు.

చిట్టివలసలో ఆంధ్రా, తెలంగాణ బాడీబిల్డింగ్ పోటీలు



సంతపేట చిల్డ్రన్స్ పార్కులో బిల్డర్స్‌తో కోచ్ కోటిరెడ్డి

తగరపువలస: శ్రీఆంజనేయం మజిల్ ప్లానెట్ జిమ్ ఏర్పాటు చేసి 15 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా విజయ దశమికి చిట్టివలసలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వారితో బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిమ్ కోచ్ బోర కోటిరెడ్డి తెలిపారు. సంతపేట చిల్డ్రన్స్ పార్కులో రూ.12 లక్షల విలువైన పరికరాలతో జిమ్ పునరుద్ధరణ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడారు. రెండు రాష్ట్రాల నుంచి 350 మంది వరకు బిల్డర్లు ఇందులో పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఈ పోటీల్లో వివిధ కేటగిరీల వారీగా ఔత్సాహికులతోపాటు మహిళలు, దివ్యాంగులు, మాస్టర్లను ఆహ్వానిస్తున్నామన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందిస్తామన్నారు. వసతి, ఆహారం సమకూరుస్తామన్నారు. జూన్ 3న గోవాలో జరగనున్న ఆసియా ట్రయల్స్ ఎంపిక పోటీల్లో తాను పాల్గొంటున్నట్టు కోటిరెడ్డి తెలిపారు. ఇందులో ఎంపికైతే సెప్టెంబరులో నేపాల్ రాజధాని ఖాట్మాండులో జరిగే అంతర్జాతీయ బాడీబిల్డింగ్ పోటీల్లో పాల్గొంటానన్నారు. సమావేశంలో 50 మంది వరకు బిల్డర్లు పాల్గొన్నారు.

'చలో విజయవాడ' విజయవంతానికి పిలుపు

పద్మనాభం: భవిష్యత్ కార్యాచరణ కోసం ఈ నెల 30న నిర్వహించనున్న చలో విజయవాడ విజయవంతం చేయాలని నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా కమిటీ అధ్యక్షుడు పాండ్రంగి గోపి, కార్యదర్శి బ్రహ్మం, కార్యవర్గ సభ్యుడు మొకర రవి ఒక ప్రకటనలో కోరారు. గత ఏడాది ఆగస్ట్ 16, 18 తేదీల్లో వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఉద్యోగ సంఘ ప్రతినిధులతో జరిపిన చర్చల్లో రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్‌లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న వారికి వేతనాలు పెంచడంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తామని అంగీకరించినప్పటికీ నేటికీ అమల్లోకి రాలేదని తెలిపారు. ఈ సమస్యలపై నెల 30న తలపెట్టిన కార్యక్రమానికి నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వైవీ సుబ్బారెడ్డి పర్యటన నేడు

పద్మనాభం: మండలంలోని రేవిడి గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్', 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభంకానున్న కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు విచ్చేయనున్నారని తెలిపారు. పర్యటనను కార్యకర్తలు, గృహసారథులు విజయవంతం చేయాలని కోరారు.

హిందీ పాఠ్య పుస్తకాలు పంపిణీ



పంపిణీ చేసిన హిందీ పుస్తకాలతో విద్యార్థులు

తగరపువలస: భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు ఆర్థిక సాయంతో ఆదర్శప్రేమీ మండలి విద్యార్థులకు మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు పాఠ్య పుస్తకాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ భాష నేర్చుకోవడం వల్ల దేశ వ్యాప్తంగా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అందువల్ల దాతల సాయంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించడానికి ఉచితంగా పుస్తకాల పంపిణీ, ఫీజులు చెల్లించడం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు పాట్నూరు చంద్రశేఖర్, మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, ఉపాధ్యాయులు ఎస్.జయసుధ, జె.రమాదేవి, బీఎస్ఎస్ గౌరి, పి.శ్రీనివాసరావు, కె.సతీష్‌కుమార్, ఎస్.సునీత, ఎం.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలిస్తే క్రిమినల్ కేసులు



మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

కొమ్మాది: కొండల నుంచి గ్రావెల్, రాళ్లను అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని భీమిలి తహసీల్దార్ వేణుగోపాల్ హెచ్చరించారు. జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం సచివాలయం వద్ద లారీలు, జేసీబీలు, ట్రాక్టర్ల యజమానులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నిసార్లు హెచ్చరించినా గ్రావెల్ తరలిస్తున్నారని, ఇకపై క్షమించేది లేదన్నారు. కొండను తవ్వే వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు జేసీబీలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే కె.నగరపాలెం, కాపులుప్పాడ ప్రాంతాల్లో గ్రావెల్ అక్రమ రవాణాతో కొండలు సగబాగం తరిగిపోయాయని, దీనిపై ఉన్నతాధికారులు ఆగ్రహంగా ఉన్నారన్నారు. ఎవ్వరైనా అనధికారికంగా గ్రావెల్, రాళ్లు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



ఉదయ్ కుమార్‌కు బీమా సొమ్ము అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంతపేటకు చెందిన కొయ్య ఉదయకుమార్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా రూ.10వేలు శుక్రవారం అందించారు. ఉదయ్‌కుమార్ తల్లి మాలతి గురువారం మరణించడంతో ఈ మొత్తాన్ని అందించినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో చిల్ల భాస్కరరెడ్డి, చిప్పాడ వెంకటేష్, సరగడ నాగిరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, చేట్ల ఎల్లయ్యరెడ్డి, చిల్ల సూరిబాబు, నీలాపు సురేష్‌రెడ్డి, ఎస్.అప్పారావు, సచివాలయ కార్యదర్శి శ్రీహరి పాల్గొన్నారు.

పక్కి దివాకర్ కుటుంబానికి పరామర్శ



పక్కి దివాకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, కోలా గురువులు

కంచరపాలెం: ఇటీవల మరణించిన రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పక్కి దివాకర్ కుటుంబ సభ్యులను మర్రిపాలెంలోని స్వగృహంలో శుక్రవారం రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు పరామర్శించారు. దివాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి, బీసీ అధ్యయన కమిటీకి దివాకర్ చేసిన సేవలను గుర్తు చేశారు. అందరితో కలిసికట్టుగా ఉంటూ అనేక సేవలందించిన దివాకర్‌ను కోల్పోవడం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు కోటాన రాము, రామన్న పాత్రుడు, సత్యాల సాగరిక, సత్యాల వెంకట్, అప్పారావు, బొండాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని విశ్రాంత విద్యుత్ ఉద్యోగి దుర్మరణం



అప్పారావు మృతదేహం

పీఎం పాలెం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఎదురుగా డబుల్‌రోడ్డులో వాకింగ్ చేస్తున్న లెంక అప్పారావు(76)ను కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య భారతి పీఎం పాలెం పోలీసులకు ఈ మేరకు ఫిర్యాదు చేసింది. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన అప్పారావు విద్యుత్‌శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. క్రికెట్ స్టేడియంకు ఎదురుగా ఉన్న ఎంవీవీ సిటీలో కుటుంబ సభ్యులతో నివసిస్తున్నారు. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం సహచరులతో కలిసి వాకింగ్‌కు వెళ్లిన అప్పారావును వుడా కాలనీవైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారుతోపాటు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. పీఎం పాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకరంగా శిథిల విద్యుత్ స్తంభం



కొండపేటలో కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు కొండపేటలో 38 ఎ8 నంబరు గల విద్యుత్ స్తంభం కూలడానికి సిద్ధంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్తంభం తుప్పు పట్టడంతో ఇటీవల స్థానికుల ఫిర్యాదు మేరకు జీవీఎంసీ సిబ్బంది అడుగు భాగం చుట్టూ కాంక్రీట్ వేశారు. అయినప్పటికీ గాలులు వీచే సమయంలో ఊగుతూ భయపెడుతున్నందున శాశ్వత పరిష్కారంగా దీనిని తొలగించి ప్రత్యామ్నాయంగా సిమెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కొండపేట వాసులు కోరుతున్నారు.

విచ్చలవిడిగా పందుల సంచారం



గ్రామం మధ్యలో సంచరిస్తున్న పందులు



మురుగుగుంట వద్ద ఉన్న పందులు

వేములవలస గ్రామస్తులకు ఇక్కట్లు

ఆనందపురం : మండలంలోని వేములవలస (ఆనందపురం జంక్షన్)లో పందులు విచ్చలవిడిగా సంచరిస్తుండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ శివారులో తగిన ఏర్పాట్లు చేసుకొని పందుల పెంపకం చేపట్టాల్సి ఉంది. వాటిని విచ్చలవిడిగా విడిచి పెట్టడానికి లేదు. కానీ ఇక్కడ పందులను గ్రామం మధ్యలోనే పెంచుతున్నారని గ్రామస్తులు తెలుపుతున్నారు. వాటిని మేత కోసం విడిచి పెడుతుండగా అవి గ్రామంలోని రోడ్లపై సంచరిస్తూ నేరుగా ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఆహర పదార్థాలను పాడుచేయడంతోపాటు పరిసరాలను కలుషితం చేస్తున్నాయని చెబుతున్నారు. ఎక్కడ మురుగు కుంటలు ఉంటే అక్కడకు చేరుకొని దొర్లుతుండడంతో దుర్వాసన వ్యాపిస్తోంది.

అలాగే వేములవలస మార్కెట్‌లో రోజువారీ పేరుకుపోయిన వ్యర్థాల కోసం పందులు చేరుతున్నాయి. అక్కడ కూరగాయలు, ఆకుకూరలు తినేస్తూ పాడు చేస్తున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. పందులను ఆరుబయట విచ్చలవిడిగా విడిచిపెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రతీ కుటుంబానికీ సంక్షేమ పథకాలు



మారికవలస ఆర్‌జీకే కాలనీలో లబ్ధిదారులకు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, అందరూ ప్రభుత్వ పథకాలతో సంతృప్తితో ఉన్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డు ఆర్‌జీకే కాలనీ 1నుంచి 10 బ్లాకులు, శారదా నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.

సమస్యలు పరిష్కరిస్తామని భరోసా కల్పిస్తూ ముందుకు సాగారు. ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన మేలుకు సంబంధించిన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శారదా నగర్ కొండపై సీసీ రోడ్డు, తాగునీరు, కమ్యూనిటీ హాలు, అంగన్‌వాడీ కేంద్రం, ఆర్‌జీకే కాలనీలో శానిటేషన్, తాగునీరు సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ నిత్యం పేద ప్రజల సంక్షేమం, మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచిస్తున్నారని, ఆయనకు అందరూ అండగా నిలవాలని కోరారు. ఎక్కడ ఏ విధమైన సమస్యలు ఉన్నా తమకు, తమ నాయకులు, సచివాలయ ఇన్‌చార్జులు, గృహసారథుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, జెడ్పీ కె.కనక మహాలక్ష్మి, తహసీల్దార్ సనపల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్షణ గోడ నిర్మాణంతో సమస్య పరిష్కారం



బీచ్‌రోడ్డు వద్ద విరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న రక్షణ గోడ ప్రాంతం (ఫైల్)



ఈ ప్రాంతంలో కొత్తగా నిర్మించిన రక్షణ గోడ

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులోని రక్షణ గోడ ఒకచోట దెబ్బతిని చాలా ప్రమాదకరంగా మారగా అక్కడ అవసరమైన మేరకు గోడ నిర్మించడంతో సమస్య పరిష్కామైంది. ఇక్కడి లైట్‌హౌస్ మీదుగా జిల్లా పరిషత్ అతిథి గృహం వైపు వెళ్లే మార్గంలో బోయివీధి వద్ద ఎడమ వైపు గోడ కొంత భాగం దెబ్బతినింది. అక్కడ మలుపు ఉండడంతోపాటు రోడ్డు ఎత్తుగా ఉంటుంది. దీంతో బీచ్‌వైపు సుమారు పది అడుగులపైనే గొయ్యిలా ఉంటుంది. ఇది పెద్ద ప్రమాదకరంగా మారింది. విశాఖ నుంచి బీచ్‌రోడ్డులో ఇక్కడి బీచ్‌కు వచ్చే వాహనాలన్నీ ఇదే మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా భీమిలి నుంచి వెళ్లే సమయంలో ఎడమ వైపునకు ఈ గొయ్యి ఉండడం, అక్కడ రోడ్డు మలుపు వల్ల ఎంతో ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ ఎదురుగా వాహనాలు వచ్చే సమయాల్లో వాటిని తప్పించుకుని వెళ్లే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల రెండు కార్లు ఇక్కడ ప్రమాదాలకు గురై గోతిలో పడిపోయాయి. ఇక ద్విచక్రవాహనాలు, ఆటోలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి.

ఈ క్రమంలో ఇటీవల బీచ్ సుందరీకరణ పనుల్లో భాగంగా దెబ్బతిన్న గోడ ప్రాంతంతోపాటు రోడ్డు చివరి వరకు రక్షణ గోడ నిర్మించారు. దీంతో సమస్య పరిష్కారమడంతో వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి.